# యథేచ్ఛగా భూముల కబ్జా

## సూచికల బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం

- జోరుగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

మేడ్చల్, ఫిబ్రవరి10(నమస్తే తెలంగాణ): అధికారులకు నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూములలో సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గంలోని పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్ కార్పొరేషన్లలో ప్రభుత్వ భూముల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దల సహకారంతోనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నట్లు ప్రజల నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయి. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో 103 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. వివిధ డివిజన్లలో ప్రధాన రహదారుల వెంట అనుమతులు లేని షెడ్లు అనేకం వెలుస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోనే 975 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైనట్లు అధికారుల లెక్కల్లో తెలింది. ఇందులో 613, 614, 510, 432, 495 సర్వే నంబర్‌లలో ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా చేసి కబ్జాదారులు విక్రయిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారం లోని 307, 325, 329, 342 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయి.

*పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలు*

### గోప్యంగా భూముల వివరాలు..

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ భూమి అని తెలిపే విధంగా సూచిక బోర్డుల ఏర్పాటులో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5,619 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులలో ఉంది. అయితే ఇటీవల ప్రభుత్వ భూముల లెక్కను తేల్చినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వ భూముల వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. గుర్తించిన ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు గురికాకుండా ఉండేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి అవసరమైతే ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు అమలు చేయడం లేదు. దీంతో యథేచ్ఛగా భూములు కబ్జాలకు గురై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

### క్రిమినల్ కేసుల నమోదేది!

అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్న అధికారులు హెచ్చరికలకు మాత్రమే పరిమితమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తే తిరిగి మళ్లీ నిర్మించుకుంటున్నారు. ఇదంతా అధికారులు చూస్తున్న కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## రేపు జాబ్ మేళా

అమీర్‌పేట్ ఫిబ్రవరి 10: రంగారెడ్డి జిల్లా నేషనల్ కెరీర్ సర్వీస్, డాన్ బాస్కో, దిశ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలోని దిశా కేంద్రంలో మెగా జాబ్ ఫెయిర్ జరగనుంది. ఈ జాబ్ ఫెయిర్ లో టెక్ మహేంద్ర, అపోలో, మెడ్ ప్లస్, ఎంపవర్ మెంట్ సర్వీసెస్ సహా పలు ఇంటర్నేషనల్ స్కూల్స్ భాగస్వాములవుతున్నాయన్నారు. అభ్యర్థులు 10వ తరగతి , ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్‌పూర్తి చేసిన వారు అర్హులని కోఆర్డినేటర్ ఐవనో వాజ్ తెలిపారు. వివరాలకు నంబర్ 9848 273301ను సంప్రదించాలని కోరారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

అమీర్‌పేట్, ఫిబ్రవరి 10: ఎస్సార్ నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి బాపునగర్ వెళ్లే దారిలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఎస్సార్ నగర్ లోని 7-1- 621 /309 లో అనుమతుల మేరకు కాకుండా అదనంగా 6వ అంతస్తు నిర్మాణాలు జరుగుతున్నట్టు అందిన ఫిర్యాదుల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సైదుద్దీన్ ఆధ్వర్యంలో సెక్షన్ ఆఫీసర్ మన్సూర్ తారిక్ తన సిబ్బందితో కలిసి కూల్చివేశారు.

## సర్వేలో కాంగ్రెస్ విఫలం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 10: బీసీల సంఖ్య పెరిగితే వాటా అడుగుతారనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన అసంబద్ధంగా చేసిందని, బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని, 51శాతం ఉన్న బీసీలు 46శాతమే ఉన్నారని కాకిలెక్కలు ప్రభుత్వం చూపించిందని బీసీల గొంతుక జవహర్‌నగర్ మాజీ మేయర్ కావ్య మండిపడ్డారు. 42శాతం కోటతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, కులగణన సర్వేలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన కులగణన సర్వే పక్కాగా ఉందన్నారు. తాజా సర్వేలో 22లక్షల బీసీల జనాభా ఎలా తగ్గుతుందని ఎద్దేవా చేశారు.

## భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): తెలుగు కథానిక రచయితలు, రచయిత్రుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కథానికల పోటీ నిర్వహిస్తున్నదని భూపతి చంద్ర స్మారక సంస్థ అధ్యక్షుడు ఎమ్ఎల్ కాంతారావు తెలిపారు. ఆసక్తి గల రచయితలు, రచయిత్రులు కథానికలను పంపించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించేలా నాలుగు పేజీలకు మించకుండా కథానికలు ఉండాలని సూచించారు. సికింద్రాబాద్ ఓల్డ్ అల్వాల్, బీఆర్ రావు నగర్‌లోని భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ సమన్వయకర్త కార్యాలయానికి మార్చి 10వ తేదీ లోపు పంపించాలని కోరారు. ప్రోత్సాహక బహుమతులు రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు అందజేస్తామని తెలిపారు.

## హైడ్రా ప్రజావాణిలో 64 ఫిర్యాదులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. పార్కులు కాపాడాలని, రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను తొలగించాలని మొత్తం 64 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులు, జోన్ల ఇన్‌చార్జిలతో మాట్లాడి గూగుల్, సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులను సరిపోల్చి సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి సర్కిల్‌లోని ఆర్‌కేపురం ఆఫీసర్ల కాలనీలో మూడు వేల గజాల పార్కుస్థలం కబ్జాకు గురైందని ఆర్మీ ఆఫీసర్ల కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి జేఎన్టీయూ ఎదురుగా ఉన్న సుబోధ, స్వగృహ హౌసింగ్ సొసైటీలో ప్రజావసరాలను ఉద్దేశించి కేటాయించిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని, అంబీర్ చెరువు కబ్జాలకు గురవుతోందని, ఆదిత్యనగర్‌లో 2 వేల గజాల స్థలం కబ్జాకు గురవుతుందని ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోచారం మున్సిపాలిటీ ఘటకేసర్‌లోని జయపురి కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని అక్కడి ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. పోచారం మున్సిపాలిటీలోని ఏకశిలానగర్ కాలనీలో ఉన్న పార్కుల స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కూడా కబ్జా చేస్తున్నారని కాలనీకి వెళ్లే 50 ఫీట్ల రహదారిలో 15 అడుగుల మేర అక్కడి ఇంజినీరింగ్ కళాశాల వారు ఆక్రమించి వాహనాల పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మున్సిపాలిటి బౌరంపేటలో డాలర్‌మెడోస్ పేరిట ఉన్న తమ కాలనీకి రహదారి లేకుండా చేశారని నివాసితులు కమిషనర్ రంగనాథ్‌కు తెలిపారు.

## రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హిందూస్ ఫర్ హ్యూమాలిటీ అండ్ ఈక్వాలిటీ జాతీయ అధ్యక్షుడు ఖదిజ్ఞాసి త్రినాథ దాస్, అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి అన్నారు. సోమవారం హెచ్ పీఈ జాతీయ నాయకుల బృందం రంగరాజన్‌ను పరామర్శించి ఆయనకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కళియుగ రామరాజ్య స్థాపకులు రంగరాజన్‌ను బెదిరించిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. మతం పేరిట జరిగే మతోన్మాద చర్యలను హైందవ మత ప్రతిష్ఠను దిగజారుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జై భారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్, హెచ్‌పీఈ నాయకులు ఖాదిజ్ఞాసి మల్లికావల్లభ, నర సింహాచార్యులు, ఖాదిజ్ఞాసి సత్యనారాయణ, బీవీ రెడ్డి పాల్గొన్నారు.



*రంగరాజన్‌ను పరామర్శిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు*

బడంగ్‌పేట: రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బ్రాహ్మణ సంఘాల నాయకులు అన్నారు. సనాతన ధర్మ రక్షకులు హైందవ ధర్మ రక్షణకు కంకణ బద్ధులై, పనిచేస్తున్న వారిపైన దాడులు చేయడం సరికాదన్నారు. బడంగ్‌పేట నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు.

మనసురాబాద్: రంగరాజన్ పై దాడి వెనుక ఉన్న కుట్రను వెంటనే ఛేదించి నిందితులను కఠినంగా శిక్షించాలని శ్రీ వైష్ణవ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువెంగళాచార్యులు, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్ డిమాండ్ చేశారు. మనసురాబాద్ డివిజన్ పరిధి చంద్రపురి కాలనీలోని శ్రీ వైష్ణవ సేవా సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంగరాజన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి

బొల్లారం: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా తమ ఆస్తులు, గృహాలను కోల్పోతున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని సోమవారం కంటోన్మెంట్ బోర్డు ఎదుట బాధితులు ఆందోళన చేశారు. కంటోన్మెంట్ బోర్డ్ లోని ఫిషర్ పురలోని నివాస గృహాలను ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలని బస్తీ వాసులకు అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో నాలుగో వార్డ్ పరిధిలోని ఫిషర్ బస్తీ వాసులు రోడ్లపైకి వచ్చి కంటోన్మెంట్ బోర్డ్ ముందు నిరసన చేపట్టారు. ట్రైబ్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు శశికపూర్ , ఉపాధ్యక్షుడు ప్రభాకర్ , సెక్రటరీ బాలకృష్ణ పాల్గొన్నారు

## మిసెస్ ఇండియా పోటీలకు మహిళలు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: తెలంగాణ,ఏపీ రాష్ట్రాలకు చెందిన 11మంది మహిళలు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న మిసెస్ ఇండియా-2025 పోటీల్లో పాల్గొననున్నారని నిర్వాహకురాలు మమతా త్రివేది ప్రకటించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60ఏళ్ల పైబడిన వారికోసం నిర్వహించనున్న మిసెస్ సూపర్ క్లాసిక్ విభాగంలో డా. రష్మి కాండ్లికర్, డా. పి.సీత , క్లాసిక్ విభాగంలో మైత్రేయి అమృత, అర్చన కొనకంచి, జే.శృతి, మిసెస్ శ్రీమతి కేటగిరిలో సుదీప్తా దాస్, మిథాలీ అగర్వాల్ తదితరులు తెలంగాణ తరపున పోటీ పడనున్నారని వివరించారు. ఏపీ నుంచి మరో నలుగురు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## ఇండియా ఆర్ట్ ఫెయిర్‌లో కళాకారులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 10: ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2025లో భాగంగా సాల్వడోర్ దాలి ఆర్ట్ ప్రదర్శన ఢిల్లీలో నిర్వహించారు. క్రిస్టిన్ ఆర్జిలే క్యురేషన్‌లో ఇండియా హాబిటాట్ సెంటర్‌లో విజువల్ ఆర్ట్స్‌గ్యాలరీలో ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కళాకారులు, విద్యావేత్తల బృందం ప్రఖ్యాత సుర్రియలిస్టు కళాకారుడు సాల్వడోర్ దాలి అరుదైన కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిరతన్ షిండే, శేఖర్ షిండే, రామకృష్ణ కొంగల్లా, శ్రీనివాస్, సంతోష్, రాజారాం, వాసుదేవరావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 57 ఫిర్యాదులు

*దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి*

మేడ్చల్, ఫిబ్రవరి10(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయండి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 : అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యాలయములో ప్రజావాణిలో జడ్సీ రవికుమార్ ను కలిసి నిధులు కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధికి, సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్ లైన్ల కోసం, నీటి ఇబ్బందులు రాకుండా నల్ల కనెక్షన్ల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ అంజయ్య, రాము యాదవ్, అమీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## శంషాబాద్ డిగ్రీ కళాశాలతో ఒప్పందం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: ఇటీవల సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో శంషాబాద్(రాజేంద్రనగర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఫ్రాన్స్‌లోని యూరోపియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీతో కొలాబరేషన్ కలిగి ఉన్న అబిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్మోటిక్ సైన్స్ ఒప్పందం చేసుకోవడం కోసం ముందుకు వచ్చినట్లు శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని తమ కళాశాలకు సహకారం అందించాలని కోరడంతో స్పందించిన సంస్థ మహారాష్ట్రలోని నాసిక్ కేంద్రంగా కొనసాగుతున్న యూనివర్సిటీ విద్యార్థులకు అవసరమైన ఉత్తమ కోర్సులు నేర్పించడం కోసం ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్, మొగిలిగిద్ద జూనియర్ కళాశాలలకు కూడా అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారని తెలిపారు.

## దయానంద గౌడ్‌కు ఉత్తమ నిర్మాత అవార్డు

అబిడ్స్ ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి మూకీ చిత్రాన్ని నిర్మించిన ప్రముఖ నిర్మాత గజగోని దయానంద గౌడ్ కు ఉత్తమ నిర్మాత అవార్డు దక్కింది. తెలుగు వర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ సినీ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా నిర్మాత దయానంద గౌడ్ కు అవార్డును వంశీ అంద జేశారు. ఈ సందర్భంగా దయానంద్ గౌడ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని నిర్మించడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చిందని త్వరలోనే ప్రేక్షకులకు ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.

## వేతనాల కోసం ఆందోళన

*ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది*

కొండాపూర్, ఫిబ్రవరి 10 : కొండాపూర్ లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న పేషెంట్ కేర్, శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది తమకు వేతనాలు రావడం లేదని ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఏజన్సీలు తమ జీతాలు సమయానికి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రోగులతో రద్దీగా ఉండే జిల్లా దవాఖానలో నిరంతరాయంగా సేవలందిస్తున్న తమని ప్రభుత్వం గుర్తించి, సరైన సమయానికి జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొండాపూర్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణి రెడ్డి కి వినతి పత్రం అందజేశారు.

మహింద్రా యూనివర్సిటీ, రోటరాక్ట్ క్లబ్ ఫిబ్రవరి 10న అధికారికంగా చార్టర్ చేయబడింది. ఇది సేవ, నాయకత్వం, నిర్ణయాత్మక కొత్త శకానికి గుర్తుగా నిలిచింది. మొయినాబాద్, రోటరీ క్లబ్ మద్దతుతో వ్యవస్థాపక సభ్యులు కౌశల్ తాళ్లూరి, నీల ఓదెల అంకిత భావంతో ఇది సఫలీకృతమైంది. ఈ వేడుకలో చార్టర్ ప్రెసిడెంట్ నందన రెడ్డి, చార్టర్ సెక్రటరీ యశ్వి సెక్సరియా నేతృత్వంలోని చార్టర్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. వారు రోటరాక్ట్ విలువలను కాపాడుతామని, సమాజానికి దోహదపడతామని ప్రమాణం చేశారు.

*– సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ);*

## సైన్స్ టాలెంట్ టెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఎన్సీఈఆర్టీ, ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు ఆన్ లైన్ మోడ్ లో ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ సోమవారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ ను జిల్లా ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ సింగ్, కోశాధికారి శ్రీనివాస చారి, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, బీసీఈబీ సెక్రటరీ సురేశ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, కూకట్ పల్లి ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డిల ప్రారంభించారు. బాచుపల్లి పాఠశాలకు చెందిన విజయ్ మొదటి స్థానం, జీడిమెట్ల పాఠశాలకు చెందిన శరణ్య రెండో స్థానం, బౌరంపేట పాఠశాలకు చెందిన సాయి సంతోష్ మూడో స్థానం, బోడుప్పల్ పాఠశాలకు చెందిన అక్షయ్‌కుమార్ కు కన్సోలేషన్ బహుమతిని గెలుచుకున్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఈనెల 12న జరిగే రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్ కు అర్హత సాధించినట్లు తెలిపారు.

## 18న ధర్నాచౌక్ సభకు తరలిరావాలి

*హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ ముదిరాజ్*

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 10: సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 18న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో జరిగే సభకు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు పిలుపునిచ్చారు. సోమవారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, వెంకట్ రెడ్డి, రమేశ్, మోహన్ మాట్లాడారు. ఈ సమావేశంలో వేదిక నాయకులు బాల బ్రహ్మచారి భాస్కర్, బాల్ రాజు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు బంగారు, వెండి తొడుగులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 10: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు అంజనేయ స్వామికి సోమవారం హైదరాబాద్ ఏఎంఆర్ ఇండియా చైర్మన్ మహేశ్వర్ రెడ్డి 325 గ్రాముల బంగారు తాపడం కిరీటం, గర్భాలయ ద్వారానికి కుడి, ఎడమ వైపు ద్వార బంధనానికి 48 కిలోల ఐదు గ్రాముల వెండిని అందజేసినట్లు ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ తెలిపారు. సుమారు రూ.కోటి విలువ ఉంటుందన్నారు. ఆలయ అర్చకులు బంగారు, వెండి పరికరాలకు సంప్రోక్షణ నిర్వహించి స్వామివారికి అలంకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి10 : ప్రభుత్వ రంగ సంస్థల్లో అక్రమంగా కొనసాగుతున్న 1050 మంది రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు డిపార్ట్‌మెంట్ హెడ్‌లుగా కొనసాగుతున్నారని దాదాపు సంవత్సరానికి కోట్ల రూపాయల ప్రజాధనం కేటాయించాల్సి వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తాము అధికారంకి వస్తే ఈ రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించి సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించి తద్వారా ఏర్పడిన ఖాళీలను నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినా నేటికి అమలుకు నోచుకోలేదని అన్నారు. ముఖ్యమంత్రి స్పందించాలని లేదంటే నిరుద్యోగులను, ఉద్యోగులను కలుపుకుని మరో ఉద్యమానికి శ్రీకారం చూడుతామని హెచ్చరించారు. నాయకులు రామ్ కిషన్, మురళీ కృష్ణ, రంజిత్ వర్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు శారీరక దృఢత్వం అవసరం

*బేగంపేట సన్‌షైన్ ఆస్పత్రిలో జరిగిన సెల్ఫ్ డిఫెన్స్ వర్క్ షాప్‌లో పాల్గొన్న మహిళలు*

బేగంపేట్ ఫిబ్రవరి 10: ప్రతి మహిళకు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం అవసరమని అందులో భాగంగానే బేగంపేటలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో పనిచేసే మహిళా ఉద్యోగులు, నర్సింగ్‌సిబ్బంది, డాక్టర్లకు సెల్ఫ్ డిఫెన్స్ వర్క్ షాప్ ను సోమవారం కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఏ వీ గురువారెడ్డి ప్రారంభించారు. మహిళలపై జరుగుతున్న దాడులు ఇతరత్రా సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ప్రతి మహిళ తనను తాను ఆపద సమయంలో కాపాడుకునేందుకు, ప్రతి ఒక్కరిలో మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతోనే సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగులందరికీ భాగంగా యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ అజయ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాప్ లో కార్డియాలజిస్ట్ డాక్టర్ కావ్య, న్యూరాలజిస్ట్ డాక్టర్ నివేదిత తో నర్సింగ్ స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కులగణనపై రీసర్వే చేయాలి

*సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం*

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్యాష్... తన క్యాస్ట్ మాత్రమే కావాలని, బడుగు, బలహీనవర్గాల గోస పట్టదని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశం గౌడ్ ఎద్దేవా చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంల